సాక్షి వికారాబాద్

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



దిగుబడి పెరిగే..

వేరుశనగ దిగుబడులు ఈసారి ఆశాజనకంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం పంట తీసే పనుల్లో ఉన్నారు. 8లో ▸



వర్గపోరుతో ఆగిన అభివృద్ధి

వచ్చే ఎన్నికల్లో తాండూరు కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే దక్కుతుందని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్ అన్నారు. 8లో ▸



మార్కెట్‌లో నకిలీ అల్లం

ప్రజల ప్రాణాలకు హాని కలిగించే కల్తీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామని ధారూరు సీఐ అప్పయ్య హెచ్చరించారు. 9లో ▸

న్యూస్‌రీల్

కంద్లపల్లి అటవీ ప్రాంతంలో మంటలు



తగలబడుతున్న యూకలిప్టస్ కొమ్మలు

పూడూరు: మండల పరిధిలోని కంద్లపల్లి అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఇటీవల తొలగించిన యూకలిప్టస్ చెట్ల కొమ్మలు ఎండిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు వీటికి నిప్పంటించడంతో అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి.

సిద్దులూరులో ఉచిత పశువైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న వెటర్నరీ అధికారి అనిల్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని సిద్దులూర్‌లో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు, పశుపోషకులు ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 12 ఆవులు, 18 గేదెలకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్సలు చేశామని తెలిపారు. 25 లేగలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ కార్యక్రమంలో ఏడీ పూర్ణచందర్‌రావు, మండల అధికారి టి.ఉష, వీఎల్‌ఓ సురేందర్, పశువైద్య సిబ్బంది ఇక్బాల్, అశోక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల జోలికి రావద్దు

పూడూరు: వక్ఫ్‌బోర్డు భూముల జోలికి వస్తే కేసులు నమోదు చేస్తామని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ ఖాదర్ హెచ్చరించారు. మండల పరిధిలోని రాకంచర్లలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం పూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ వేడుకలో పాల్గొన్న నాయకులు, యువత

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి శివాజీ మహరాజ్ నినాదాలతో మార్మోగింది. బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని శుక్రవారం డీసీసీబీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి ఆవిష్కరించారు. అంతకుముందు యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచు కుర్వ నాగర్జున, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, నాయకులు వీరేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, మొగులప్ప, జైశ్రీరామ్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు క్రీడాకారులు

ధారూరు: మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతలుగా నిలిచిన జట్లకు శుక్రవారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా వడ్ల నందు ఫౌండేషన్ అధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన సాజిద్ టీమ్‌కు రూ.25 వేల నగదు, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన రహీం జట్టుకు రూ.15 వేల నగదు, షీల్డ్ అందజేశారు. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జైదుపల్లి హన్మంత్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ నందు, సర్పంచు చంద్రమౌళి, వైస్ ఎంపీపీ విజయకుమార్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బసప్ప, కొండాపూర్‌కలాన్ సర్పంచు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జన్మదిన వేడుకలు



కొడంగల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



అనంతగిరి: మెథడిస్ట్ చర్చిలో ఎమ్మెల్యే ఆనంద్, పార్టీ నేతల సంబరాలు



తాండూరు టౌన్: వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేకులు



పరిగి: రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



మర్పల్లి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నేతలు, అభిమానులు కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు.

సొసైటీ సీఈఓ ఔట్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి

విధుల నుంచి తొలగించిన పాలకవర్గం

- అత్యవసర సమావేశంలో చైర్మన్ ప్రకటన
- శనగల కొనుగోళ్లలో అక్రమాలపై సమగ్ర విచారణకు నిర్ణయం
- కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయాలని తీర్మానం
- నూతన సీఈఓగా బందెప్పకు బాధ్యతలు

బషీరాబాద్: నావంద్గీ సొసైటీ సీఈఓ వెంకటయ్యను విధుల నుంచి తొలగిస్తూ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసింది. శనగల కొనుగోలులో సీఈఓ భారీ అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన పాలకవర్గం అత్యవసర సమావేశం నిర్వహించింది. రైతులు విక్రయించేందుకు తీసుకువచ్చిన శనగల తూకాల్లో సీఈఓ వెంకటయ్య.. ఇద్దరు కార్మికులతో కలిసి సుమారు 4 క్వింటాళ్ల వరకు అదనంగా తూకం వేయించారని చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి వివరించారు. దీన్ని విభేదించిన వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్.. మొదటి రోజు 400 బస్తాలు తూకం వేయగా.. ఒక్కో బస్తా నుంచి పది కిలోల చొప్పున 4 వేల కిలోల వేరుశనగను రైతుల నుంచి దోపిడీ చేశారని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని సభ్యులందరూ పట్టుబట్టారు.. ఒక దశలో చైర్మన్‌ను సైతం నిలదీశారు. దీంతో సీఈఓను విధుల నుంచి తొలగించడంతో పాటు ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని కోరుతూ కలెక్టర్‌కు, ఎస్పీకి రాతపూర్వక ఫిర్యాదు చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇదిలా ఉండగా తాము సొసైటీలో కుదువపెట్టిన బంగారం భద్రంగా ఉందా..? లేదా..? అని కొందరు సభ్యులు ప్రశ్నించారు. అయితే తనఖా పెట్టిన బంగారాన్ని త్వరలోనే అధికారుల సమక్షంలో చూపిస్తామని చైర్మన్ తెలిపారు. రైతుల కోసం నావంద్గీ సొసైటీలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని, వారిని మోసం చేస్తే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకునేది లేదని తెలిపారు. రైతుల్లో విశ్వాసం కలిగించేందుకే సీఈఓపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. సంఘం వ్యవహారాల్లో తప్పు చేసే వారిని ఉపేక్షించేది లేదని తెలిపారు.

బందెప్పకు బాధ్యతలు

నావంద్గీ సొసైటీ నూతన సీఈఓగా అసిస్టెంట్ అధికారిగా ఉన్న బందెప్పకు బాధ్యతలు అప్పగిస్తూ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. వెంటనే చార్జ్ తీసుకోవాలని సూచించింది. ఈయన గతంలో రెండుసార్లు ఇన్‌చార్జ్ సీఈఓగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, డైరెక్టర్లు గోపాల్‌రెడ్డి, పోలీస్ నవీన్ రెడ్డి, పి.రంగారెడ్డి, అశోక్ చంద్ర గౌతం, బి.శ్రీనివాస్‌రెడ్డి, రూప్లానాయక్, సొంపల్లి హన్మంత్‌రెడ్డి, నారా గోపాల్‌రెడ్డి, జి.నర్సిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు.. విడుదల

నావంద్గీ సొసైటీ సీఈఓ వెంకటయ్యను బషీరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సొసైటీ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న శనగల తూకాల్లో బిహార్ కార్మికులు రవీందర్ బింద్, దీపక్ కుమార్‌లతో కలిసి సీఈఓ వెంకటయ్య దోపిడీ చేశారని తేలడంతో అతడిపై రెండు రోజుల క్రితం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇద్దరు కార్మికులను బుధవారమే అరెస్టు చేశారు. అయితే శుక్రవారం సీఈఓను సొసైటీ పాలకవర్గం విధుల నుంచి తొలగించిన మరుక్షణమే సొసైటీకి వచ్చిన పోలీసులు అతన్ని అరెస్టు చేసి తీసుకెళ్లారు. తాండూరు కోర్టులో న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. కాగా, బెయిల్‌పై వెంకటయ్య విడుదలైనట్లు ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు.



వెంకటయ్య అరెస్టును మీడియాకు చూపిస్తున్న ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి

సీసీ పనుల్లో వేగం పెంచండి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- లేదంటే సదరు నిధులను ఇతర జీపీలకు మళ్లిస్తాం
- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వాలని ఆదేశం

వికారాబాద్ అర్బన్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, ఇందుకోసం స్థానికంగా లభ్యమయ్యే ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ నారాయణరెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. ఉపాధి హామీ పనులు, అవెన్యూ ప్లాంటేషన్, హరితహారం, నర్సరీల నిర్వహణ తదితర అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో చేపడుతున్న సీసీ రోడ్లకు ఇసుక కొరత నెలకొందనే అపవాదు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఎక్కడ సౌకర్యంగా ఉన్నా పర్మిషన్ ఇవ్వాలని సూచించారు. ఇతర పనులకు ఇసుకను తరలించకుండా పర్యవేక్షణ బాధ్యతలను వీఆర్‌ఏలకు అప్పగించాలన్నారు. లేదంటే సదరు నిధులను ఇతర జీపీలకు మళ్లిస్తామని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్లకు ఈ విషయాన్ని తెలియజేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం పనులు ప్రారంభమైనట్లు ఫొటోలతో పాటు, నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించేందుకు మంగళవారం నుంచి తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని కలెక్టర్ తెలిపారు. తనతో పాటు అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ, డీపీఓలు వేర్వేరుగా తనిఖీలు చేస్తారన్నారు.

నిర్లక్ష్యం వద్దు

పారిశుద్ధ్య పనుల నిర్వహణపై, హరితహారంపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ ఆదేశించారు. మురుగు కాల్వల శుభ్రత, వ్యర్థాల తొలగింపు వంటి పనులను నిత్యం చేపట్టాలన్నారు. ప్రతీ గ్రామంలో గ్రాస్ కటింగ్ మిషన్ కొనుగోలు చేయాలని సూచించారు.

అటెండెన్స్ యాప్

జిల్లా, మండల స్థాయి ఉద్యోగులందరూ అటెండెన్స్ యాప్ ద్వారా హాజరు వేయాలని, ఇందుకు డీడీఓలు బాధ్యత తీసుకుని సోమవారం నుంచి వందశాతం హాజరు నమోదయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. మండలాల్లో ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా యాప్‌లోనే అటెండెన్స్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పండ్లు పిరం

- శివరాత్రి నేపథ్యంలో ధరలకు రెక్కలు
- వికారాబాద్, పరిగిలో వెలిసిన ప్రత్యేక దుకాణాలు



వికారాబాద్‌లో వెలిసిన పండ్ల దుకాణం

వికారాబాద్ అర్బన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలో భారీగా పండ్ల దుకాణాలు వెలిశాయి. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎంఆర్‌పీ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా షామియానాలు వేసి షాపులు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ఉపవాస దీక్షలు ఆచరించే భక్తులు శుక్రవారమే పండ్లు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. పండుగ నేపథ్యంలో పండల్ల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ఏటా రెండు మూడు కిలోలు తీసుకెళ్లే వారు రేట్లకు భయపడి కిలో పండ్లతో సరిపెట్టుకున్నారు.

ధరలు ఇలా..

అరటి డజన్ రూ.50, సంత్రాలు 4– రూ.100, గ్రీన్ అంగూర కేజీ రూ.80, బ్లాక్ అంగూర రూ.200, డ్రాగన్ ఫ్రూట్ ఒకటి– రూ.100, కర్జూర కేజీ రూ.80, కర్బుజ కేజీ రూ.80, పుచ్చకాయ కేజీ రూ.20, యాపిల్ (4) రూ.100, పైనాపిల్ (1) రూ.50, నల్ల కర్జూర కేజీ రూ.250, సపోటా కిలో రూ.80, దానిమ్మ (4) రూ.100, కివి ఒకటి రూ.25 ఇలా ఏది కొనాలన్నా వినియోగదారులకు చుక్కలు కనిపించాయి.

‘మహా’గిరాకీ

పరిగి: పరిగి మార్కెట్‌కు మహాశివరాత్రి కళ సంతరించుకుంది. పండుగ సందర్భంగా పట్టణంలో పండ్ల దుకాణాలు భారీగా వెలిశాయి. పొద్దంతా ఉపవాసాలు ఆచరించే భక్తులు సూర్యాస్తమయం తర్వాత పండ్లు భుజించి దీక్షలు విరమిస్తారు. ఒక్క రోజు వ్యాపారాన్ని దృష్టిలో పెట్టుకుని పెద్ద సంఖ్యలో వెలిసిన షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కానీ పండ్ల ధరలు మాత్రం వీరిని బెంబేలెత్తించాయి.

దేశానికే రోల్ మోడల్ తెలంగాణ

రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి

షాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గిఫ్ట్ ఏ స్మైల్ కింద దివ్యాంగులకు ట్రై స్కూటీలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్, ఎంపీ మాట్లాడుతూ.. పాల మూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు తాగు, సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందజేస్తామన్నారు. ఇంటి స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ నిర్మాణం కోసం రూ.3లక్షలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఇతర రాష్ట్రాలు మనవైపు చూస్తున్నాయన్నారు.

పట్టు పరిశ్రమ లాభదాయకం



పట్టు పురుగుల షెడ్‌ను పరిశీలిస్తున్న ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు

- మల్బరీ సాగు, షెడ్ ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీలు
- ఉద్యాన శాఖ జిల్లా అధికారి చక్రపాణి

దోమ: రైతులు వరి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి డి.చక్రపాణి తెలిపారు. మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ ఏర్పాటు, నిర్వహణపై మండల పరిధిలోని బట్లచందారంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పట్టు ఉత్పత్తి ఆశాజనకంగా ఉందన్నారు. పట్టుపరిశ్రమ వ్యవసాయ ఆధారిత లాభదాయకమైన కుటీర పరిశ్రమ అని తెలిపారు. ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగు చేపడితే 5నుంచి 10 పంటలు వస్తాయన్నారు. దీనిద్వారా పది మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. బట్లచందారం ప్రాంతంలో ఎర్రని మట్టి చెల్కా భూములు ఉన్నాయని, ఉద్యాన పంటల సాగుకు ఇవి ఎంతో అనుకూలమని స్పష్టంచేశారు. మల్బరీ తోట సాగు, షెడ్ నిర్మాణం, స్టాండ్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు అందిస్తున్నాయని తెలిపారు. అవసరమైన రైతులు ఆధార్, పట్టాపాస్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్, పాస్ ఫొటో జతచేసి మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక రైతులు ఏర్పాటు చేసుకున్న కూరగాయ పందిళ్లు, బీర పంట, పట్టు పురుగుల షెడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిల్క్ బోర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ రాజదురై, పట్టుపరిశ్రమ సహాయ సంచాలకులు మల్లికార్జున్, ఉద్యాన శాఖ డివిజన్ అధికారి వైజయంతి, స్థానిక సర్పంచ్ రాములు, పట్టుపరిశ్రమ శాఖ అధికారులు విజయ్ కుమార్, కె.శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోడ్‌ను ధిక్కరించేవారిపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

తాండూరు టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ధిక్కరించేవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ తాండూరు శాఖ డిమాండ్ చేసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి కోడ్ ఉల్లంఘించారన్నారు. ఓ వైపు ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతుండగా వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమం నిర్వహించడం ఎన్నికల కోడ్‌ను తుంగలో తొక్కడమేనని దుయ్యబట్టారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ చిన్నప్పలనాయుడు, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏబీవీపీ నగర కార్యదర్శి మణికొండల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొనేశ్వర్ చారి, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు తెలిపారు.

మురళీకృష్ణకు బెయిల్

తాండూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణకు ఎట్టకేలకు బెయిల్ లభించింది. యాలాల మండలంలో శివస్వాములను దాడికి ప్రేరేపించారనే కారణంతో పోలీసులు అరెస్టు చేశారు. నాటి నుంచి పరిగి జైలులో రిమాండ్‌లో ఉన్నారు. అయితే మురళీకృష్ణ కుటుంబ సభ్యులు, స్నేహితులు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. తాండూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులు విచారణ నిమిత్తం కస్టడీలోకి మురళీకృష్ణను ఇవ్వాలని కోర్టుకు విన్నవించారు. దీంతో కోర్టు పోలీసుల విచారణకు అనుమతించింది. ఈనెల 13న డీఎస్పీ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ చేశారు. కస్టడీ సమయం ముగిశాక తిరిగి పరిగి జైలుకు తరలించారు. అయితే మురళీకృష్ణ తరపు న్యాయవాదులు బెయిల్ కోసం మరోసారి కోర్టుకు అప్పీలు చేశారు. దీంతో శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది.

చిరువ్యాపారుల తొలగింపుపై ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

కొత్తూరు: మండలంలోని జేపీదర్గా ఆవరణలో చిరు దుకాణాలను తొలగించిన వ్యవహారంపై శుక్రవారం సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు కలెక్టర్ హరీష్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డు విస్తరణకు ఎలాంటి అనుమతులు లేనప్పటికీ సమీపంలోని స్టోన్‌క్రషింగ్ నిర్వాహకులు కొందరితో కుమ్మక్కై, చిరు వ్యాపారులకు తీరని నష్టం చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. క్రషర్ నిర్వాహకుల కారణంగా చిరు వ్యాపారులకు జీవనోపాధి కరువైందని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

షాబాద్: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవా రం చోటు చేసుకుంది. షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కుంటకు చెందిన చిర్ర నర్సింహు లు (32)పుట్టుకతోనే కంతులు ఉన్నాయి. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయింది. పైగా కంతులు పెరిగాయి. బాధభరించలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న చిర్ర రాంచంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గౌతం జూనియర్ కాలేజీ జట్టు



ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ జట్టు

హోరా హోరీగా ఫైనల్స్

- 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజినల్ విన్నర్‌గా భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీ సైనిక్‌పురి జట్టు
- జూనియర్ విజేతగా గౌతం జూనియర్ కాలేజీ ఈసీఐఎల్

ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ సీనియర్, జూనియర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి.

సీనియర్ విభాగంలో ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ మహబూబ్‌నగర్, భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీ సైనిక్‌పురి జట్లు రీజినల్ లెవల్‌లో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఎంవీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. డేవిడ్ 29 బంతుల్లో 56 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన భవాన్స్ డిగ్రీ కాలేజ్ జట్టు 8.3 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 105 పరుగులు చేసి మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ సీనియర్ విభాగంలో విజేతగా నిలిచింది. జట్టులో నితీశ్ 32 బంతుల్లో 72 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.



భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీ జట్టుకు కప్ అందజేస్తున్న 'సాక్షి'ఈవెంట్స్ ఏజీఎం ఉగ్రగిరిరావు

జూనియర్ విభాగంలో
గవర్నమెంట్ జూనియర్ కాలేజీ

(బాలురు) మహబూబ్‌నగర్, గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన గవర్నమెంట్ జూనియర్ కాలేజీ జట్టు 9 ఓవర్లతో 10 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు 5.4 ఓవర్లతో 3 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి మహబూగర్నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ జూనియర్ విన్నర్స్‌గా నిలిచారు. గౌతం క్రీడాకారుడు మనీశ్ 3 వికెట్లు తీయగా, అసిలేశ్ 7 బంతుల్లో 19 పరుగులు, అన్విత్ 10 బంతుల్లో 18 పరుగులు చేశారు. రీజినల్ విన్నర్స్, రన్నర్స్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా విజేతలకు ఈవెంట్స్ ఏజీఎం ఉగ్రగిరిరావు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.

SAKSHI PREMIER LEAGUE

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

దిగుబడి మెరిసె.. రైతు మురిసె

- ఈ ఏడాది రికార్డు స్థాయిలో వేరుశనగ సాగు
- ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల మేర దిగుబడులు
- రూ.7,700 వరకు పలుకుతున్న క్వింటాలు ధర



వేరుశనగ దిగుబడులను ఆరబెడుతున్న రైతులు

ధారూరు: సాధారణంగా ప్రతి ఏడాది ఎకరాకు 5 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి సాధించే వేరుశనగ రైతులు ఈసారి ఏకంగా ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడిని సాధించారు. వివరాల్లోకి వెళ్తే.. ధారూరు మండలంలో రైతులు వేరుశనగ పంట ఎక్కువగా సాగు చేస్తారు. ప్రతి ఏడాది అక్టోబర్ మొదటి వారంలో పంట వేయగా ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో చేతికొస్తుంది. ఒక్క ధారూరు క్లస్టర్ పరిధిలోనే 324 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగుచేశారు. లేపాక్షి, కదిరి, కె–6 రకాల వేరుశనగను సాగుచేశారు. కె–6 వేరుశనగకు ఇదివరకు క్వింటాలుకు రూ.5 వేల వరకే ధర పలికేది ఈసారి మాత్రం క్వింటాలు రూ.7,700 వరకు పలుకుతోంది. పెట్టుబడి అంతే ఉన్నా దిగుబడి మాత్రం రెట్టింపు వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల వద్దకే వ్యాపారులు

వేరుశనగకు కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులు నేరుగా రైతుల పొలాల వద్దకు వెళ్లి అక్కడే కొనుగోలు చేస్తుండటంతో రవాణా చార్జీలు కూడా మిగులుతున్నాయి. ఈ పంటకు కీటకాలు చాలా తక్కువ అని, పంటకు ఏదైనా రోగం వస్తే వ్యవసాయ విస్తరణ అధికారి సూచనలు పాటించి వాటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు రైతులు. పంటకు నీటి తడులు అందించడం వల్ల కూడా దిగుబడి అధికంగా వస్తున్నాయి.

వాతావరణం కూడా అనుకూలించింది



రాంపూర్ తండా రైతులు అధికారులు అందించే సలహాలు, సూచనలు తప్పకుండా పాటిస్తున్నారు. విత్తనాలు వేసినప్పటి నుంచి కోత దశ వరకు యాజమాన్య పద్ధతులు పాటించాలి. జిప్సమ్ వేసే అలవాటు లేని రైతులకు ఊడలు దిగే సమయంలో దగ్గర ఉండి జిప్సమ్‌ను వేయించాను. ఈ ఏడాది రైతులకు వాతావరణం కూడా బాగా అనుకూలించింది.

– సంజూరాథోడ్, ఏఈఓ, ధారూరు

ఓటమి విజయానికి సోపానం



గుంటూరు జట్టుకు మొదటి బహుమతి అందజేస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్

మోమిన్‌పేట: ఓటమి విజయానికి సోపానమని జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి డప్పు దరువు పోటీలలో భాగంగా గుంటూరు జట్టుకు ప్రథమ, ఖమ్మం జట్టుకు రెండవ, నారాయణఖేడ్ జట్టుకు మూడో నగదు బహుమతులను అందజేశారు. ది లైట్ ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ టి.ఆనంద్ ఆధ్వర్యంలో ఈ పోటీలు మోమిన్‌పేటలో నిర్వహించారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓడినవారు నైరాశ్యం చెందాల్సిన అవసరం లేదన్నారు. అది మీ విజయానికి నాంది పలుకుతుందన్నారు. మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.30వేలు, మూడో బహుమతి రూ.10వేల నగదును అందించారు. మరుగున పడుతున్న కళలను తిరిగి ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్న ది లైట్ ఫౌండేషన్ చైర్మన్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ డాక్టర్ టి.ఆనంద్, వైస్ చైర్మన్ రాఘవన్‌నాయక్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, న్యాయమూర్తులు అందె భాస్కర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయం

కొత్తూరు: పుట్టగొడుగుల పెంపకంతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి సూచించారు. రాజేంద్రనగర్‌లోని కళాశాల ప్రాంగణంలో శుక్రవారం మండల పరిధిలోని మల్లాపూర్, తీగాపూర్ గ్రామాలకు చెందిన రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయంలో లాభాలు వచ్చే పంటలను మాత్రమే సాగుచేయాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఈశ్వరి, ప్రమీల, విద్యాసాగర్, ఏఓ గోపాల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తేనే పేదల బాధలు తీరుతాయ్

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

కొందుర్గు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల కష్టాలు తీరుతాయని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్టీ నాయకులు కొందుర్గు మండలంలోని అయోధ్యాపూర్ తండా, పుల్లప్పగూడ, చిన్నఎల్కిచర్ల, శ్రీరంగాపూర్, అయ్యవారిపల్లి, రామచంద్రాపూర్, పులుసుమామిడి, పర్వతాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమానికి వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయా గ్రామాల ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతు కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో ఇప్పటి వరకు ఇక్క ఇల్లు ఇవ్వలేదన్నారు. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీకి ఎంతో ఆదరణ ఉందని, కాంగ్రెకు పూర్వ వైభవం వస్తుందని అన్నారు. కాగా చిన్నల్కిచర్లలో జోగు జంగయ్య భార్య అనారోగ్యంతో మృతిచెందారని, వారికి ఇద్దరు చిన్నారులు ఉన్నారని, కనీసం ఉండటానికి ఇల్లు లేని దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ స్పందిస్తూ జంగయ్య కుటుంబానికి ఇల్లును నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, రఘు, బాల్‌రాజ్ గౌడ్, సత్తయ్య, వజ్రమ్మ, జితేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, చంద్రశేఖర్, మంజుల, నరేందర్, రవీందర్, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలు ముస్తాబు



మహాదేవుని ఆలయం



గాడిబాయి శివాలయం

కొడంగల్ రూరల్: పట్టణంలోని గాడిబాయి, మహాదేవుని, బసవేశ్వరస్వామి తదితర శివాలయాలు ముస్తాబయ్యాయి. మహా శివరాత్రిని పురస్కరించుకొని నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా అన్నిఏర్పాట్లు చేశారు. గాడిబాయి, మహాదేవుని ఆలయాలు అతి పురాతన మైనవి. గాడిబాయి శివాలయం ఎదుట అతి పాడవాటి గాడి ఉండడంతో గాడిబాయి శివాలయంగా పిలుస్తారని, దాదాపు ఐదు వందల ఏళ్ల క్రితం చోళ రాజుల కాలం నాటి ప్రాచీన లిపి ఆలయ ముఖ ద్వారంపై ఉన్నట్లు గ్రామపెద్దలు చెబుతున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలలో ఉదయం నుంచే రుద్రాభిషేకం, బిల్వార్చన, పంచామృతాభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోనున్నారు.

రాంపూర్.. చిరుధాన్యాల సాగు జోర్

ఆదర్శంగా నిలుస్తున్న రైతులు

ధారూరు: మండల పరిధిలోని రాంపూర్ తండా రైతులు చిరుధాన్యాలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. చిరుధాన్యాల విలువను చాటుతున్నారు. పురాతన కాలంలో సంప్రదాయ పంటలను ఇష్టంగా సాగుచేసేవారు. ప్రస్తుత కాలంలో చిరుధాన్యాల సాగుకు రైతులు దూరంగా ఉంటున్నారు. ఇందుకు కారణం ఆశించిన దిగుబడి ఉండదని, తగిన మార్కెటింగ్ సౌకర్యం లేదని, వినియోగించేవారు అతి తక్కువ అనే భావనతో రైతులు రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు లాంటి చిరుధాన్యాల సాగుకు దాదాపు స్వస్తి పలికారు. సంప్రదాయ పంటల సాగును వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా కొర్రలు, సామలు, సజ్జలు, పచ్చజొన్నలను సాగు చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి తోడ్పాటు అందిస్తున్నాయి. రాంపూర్‌తండా సంప్రదాయ పంటల సాగుకు కేరాఫ్ అడ్రస్ అయ్యింది. సజ్జలు అంటే పట్టణ, నగర ప్రజలకు చాలా వరకు తెలియదు. సజ్జలు తినడం వలన షూగర్ వ్యాధి కంట్రోల్ అవుతుందని డాక్టర్లు సైతం ధ్రువీకరిస్తున్నారు. సజ్జలు రక్తంలో చక్కెరను అదుపులో ఉంచుతాయని చెబుతున్నారు. పల్లె ప్రాంతాల్లో ఎవరో ఒకరు వీటిని పండిస్తే కొనడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి. ధారూరు మండల పరిధిలోని రాంపూర్‌తండాకు చెందిన గిరిజన రైతు విస్లావత్ చందునాయక్‌తో పాటు మరికొందరు రైతులు ఈ సజ్జ పంటను సాగుచేశారు. సాగు చేసిన పంటను అడవి పందుల బారి నుంచి కాపాడుకోవడానికి పొలం చుట్టూ చీరలను, పంచెలను ఏర్పాటు చేశారు. మరో 15 రోజుల్లో పంట చేతికి వస్తుందని రైతులు తెలిపారు.



రాంపూర్‌తండాలో సజ్జ పంట సాగు

వర్గపోరుతో ఆగిన అభివృద్ధి

- ఈసారి తాండూరు టికెట్ నాకే
- పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్



మాట్లాడుతున్న రమేశ్ మహరాజ్

తాండూరు రూరల్: ఈసారి తాండూరు కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే దక్కుతుందని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్ అన్నారు. శుక్రవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. కొందరు నాయకులు పార్టీ మారినా.. క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్ అలాగే ఉందన్నారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మధ్య వర్గపోరుతో తాండూరు అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇద్దరు నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారే తప్పా.. అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఒకరేమో ఇసుక మాఫియా, మరొకరు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీరిద్దరికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఫైర్‌బ్రాండ్ రాకేశ్ మహరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు ఉత్తమ్‌చందు, ,జనార్దన్‌రెడ్డి, నాగప్ప, జర్నప్ప, పురుషోత్తంరెడ్డి, అశోక్, జగదీశ్ పాల్గొన్నారు.

శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించండి


నిర్వాహకులతో డీఎస్పీ సమావేశం

తాండూరు టౌన్: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం తాండూరు పట్టణంలో నిర్వహించనున్న శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని డీఎస్పీ శేఖర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హిందూ ఉత్సవ కేంద్ర సమితి, శోభాయాత్ర నిర్వాహక సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తిచేయాలన్నారు. భక్తులు ఎలాంటి పుకార్లు నమ్మరాదని, శోభాయాత్రకు పూర్తి స్థాయిలో బందోబస్తు కల్పించనున్నట్లు చెప్పారు. సమావేశంలో పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, నిర్వాహకులు రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూలతోట రామదాసుకు ఘనంగా పూజలు



భజనలు చేస్తున్న భక్తులు



పూలతోట రామదాసు

బషీరాబాద్: జీవన్గీ గ్రామం బర్కాల్ పూలతోట రామదాసు మఠంలో భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. బుధవారం నవల్గా గ్రామం నుంచి బయలు దేరిన రామదాసు పల్లకీ సేవా అదే రోజు రాత్రికి జీవన్గీ మఠానికి చేరుకుంది. మఠంలో బంట్వారం కిష్టప్ప స్వామిజీ సమక్షంలో రెండు రోజులుగా అఖండ పంచాక్షరి, అష్టాక్షరి స్మరణతో భక్తులు భజనలు చేస్తున్నారు. మఠం చైర్మన్ దాసరి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఘనంగా భజనలు చేశారు. అనంతరం రామదాసు విగ్రహానికి, శివలింగానికి పాలాభిషేకాలు నిర్వహించారు. దాసరి శారద, శాంతిగిరయ్య దంపతులు ముత్తయిదువులకు ఒడిబియ్యం పోశారు. ప్రతీ శివరాత్రికి నవల్గా నుంచి మొదలయ్యే పల్లకీ సేవా జీవన్గీ, కరన్‌కోట గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ కర్ణాటకలోని మిర్యాణ్ రామదాసు సమాధి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రామదాసు భజనమండలి సభ్యులు నవల్గా విశ్వనాథం, జగదీశ్వరయ్య, కుక్కింద అనంతయ్య, వెంకట్రామ్‌రెడ్డి, వడ్ల లాలప్ప, తలారి నర్సప్ప, తరిగోపుల వెంకట్‌రెడ్డి, జుంటిపల్లి అనంతయ్య, రామని బసప్ప తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

తాండూరు టౌన్ : సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులను అందజేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర అనే అంశంపై ఇటీవల వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి మంజుశ్రీ, ద్వితీయ బహుమతి హసీనా బేగం, తృతీయ బహుమతి విద్యాసాగర్ దక్కించుకున్నారు. వీరికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కేసీఆర్ చేసిన త్యాగాలు విద్యార్థులందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడిన కేసీఆర్ గురించి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న మంజుశ్రీ

విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

షాబాద్: విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయగారి గోవర్ధన్‌యాదవ్ అన్నారు. శుక్రవారం షాబాద్‌బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పీఈటీ, పండిట్ పదోన్నతుల ఉన్నతీకరణ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, కృష్ణ, గౌరవ అధ్యక్షుడు యాదయ్య పాల్గొన్నారు.